క్లుప్తంగా

ఓటు వృథా చేయొద్దు



గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మెట్‌పల్లిరూరల్: ఎంతో విలువైన ఓటును వృథా చేయొద్దు, గ్రామంలో అభివృద్ధి జరగాలంటే ముందు ఓటర్ నిజాయితీగా ఉండాలని సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మర్రిపల్లి మురళీకృష్ణ అన్నారు. మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లితో పాటు పలు ప్రాంతాల్లో ఆయన వినూత్న రీతిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రానున్న రోజుల్లో సేవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నటరాజ్‌కు గురుజ్యోతి జాతీయ అవార్డు

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన బోదనపు నటరాజ్ గురుజ్యోతి అవార్డు అందుకున్నారు. కళారంగంతో పాటు, ఉపాధ్యాయ రంగంలో రాణించడంతో ఆయన చేసిన సేవలను గుర్తించి ఆదివారం గ్లోబల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో విజయవాడలో గురుజ్యోతి జాతీయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నటరాజ్‌ను పలువురు అభినందించారు.

కల్యాణ మండపానికి భూమిపూజ

రాయికల్: మండలంలోని రామాజీపేట రామాలయం ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు చెరుకు మధుశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల రాజు, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నరేందర్, కోశాధికారి అయిల్నేని గంగారెడ్డి, కార్యవర్గ సభ్యులు రమాపతిరావు, మోహన్‌రెడ్డి, మోహన్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో ఆదివారం భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో నాయకులు ఇప్ప రాజేందర్, జవిడి రాజన్న, మాజీ ఎంపీపీ తోట నారాయణ, మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ద్యాగ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒబులాపూర్ వైద్యశిబిరం

మల్యాల: మండలంలోని ఒబులాపూర్‌లో ఆదివారం ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, చెవి,ముక్కు, గొంతు, నేత్ర, దంత సంబంధిత రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, వొడ్నాల రజిత, మృదుల రెడ్డి, శ్రవణ్ కుమార్, రాజశేఖర్,అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు పార్టీ

కథలాపూర్: మండలంలోని బొమ్మెన జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు పార్టీ ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేడుకలు ఏర్పాటు చేశారు.విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మధుకర్, అంబటి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరకొర సిబ్బంది.. అందని ఉపాధి

- 32 గ్రామపంచాయతీలకు 13 మందే ఫీల్డ్ అసిస్టెంట్లు
- కుంటుపడుతున్న ఉపాధి హామీ పనులు
- మేట్లతోనే నెట్టుకొస్తున్న వైనం



మూటపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

రాయికల్: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు, వలసలు తగ్గిస్తూ కూలీలకు ఆర్థికంగా చేయూతనందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. కానీ రాయికల్ మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పథకం లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ఉపాధిహామీ పథకంలో ఉపాధిహామీ కూలీల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ఖాళీలు..

మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా కేవలం 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నారు. వీరంతా కూలీలకు పనులు కల్పించడం, మస్టర్ల కేటాయింపు, పనుల పర్యవేక్షణ, జాబ్ కార్డుల మంజూరు, ఆధార్ అనుసంధానం, కూలీలకు వసతి కల్పించడం వంటిపనులు ఫీల్డ్ అసిస్టెంట్లే నిర్వహిస్తారు. మండలంలో కేవలం 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్లే ఉండటంతో ఆల్యానాయక్ తండా, అల్లీపూర్, అయోధ్య, బోర్నపల్లి, చింతలూరు, ఇటిక్యాల, జగన్నాథపూర్, కైరిగూడెం, కిష్టంపేట, కుమ్మరిపల్లి, కుర్మపల్లి, మంక్త్యానాయక్ తండా, ఒడ్డెరకాలనీ (శివాజీనగర్), రామాజీపేట, రామారావుపల్లి, సింగరావుపేట, తాట్లవాయి, ఉప్పుమడుగు, వస్తాపూర్ గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. అంతేకాకుండా టెక్నికల్ అసిస్టెంట్ల కొరత కూడా ఉండటంతో ఉపాధిహామీ పనులు గ్రామాల్లో నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాలకు ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి తూతూ మంత్రంగా ఉపాధిహామీ పనులను కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా అనుభవం ఉన్న సీనియర్ కూలీని మేట్‌గా గుర్తించి పనులు చేయిస్తున్నారు. మేట్‌లు కూడా చురుకుగా లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు ఉపాధిహామీ పనుల బాధ్యత చూస్తున్నారు. అంతేకాకుండా గ్రామసభలు, నర్సరీల నిర్వహణ, కూలీలకు వేతనాలు మంజూరు వంటి విషయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడతో పర్యవేక్షణ కొరవడుతోంది. సరైన సమయంలో కూలీలకు డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను భర్తీ చేయాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే నియమిస్తాం



రాయికల్ మండలంలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే నియమిస్తాం. ఉపాధిహామీ పనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సీనియర్ మేట్లు, గ్రామ కార్యదర్శులు చూస్తున్నారు.

– సుష్మ, ఎంపీవో

అడుగంటుతున్న భూగర్భ జలాలు



కమ్మరిపేటలో ఎండిన పొలం



భీమారంలో బోరు నుంచి బావిలోకి నీరు పోయిస్తున్న రైతు

- రైతులకు 15 రోజులు గడ్డు పరిస్థితులు
- పంట కాపాడుకోవడానికి పడరాని పాట్లు

మేడిపల్లి: భీమారం మండలంలోని చాలా గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. కాకతీయ కెనాల్, వరద కాలువలు భీమారం మండలానికి దిగువ నుంచి వెళ్తుంటాయి. మెట్ట ప్రాంతం కావడంతో భీమారం మండలానికి సాగునీరందడం లేదు. వేసవి ప్రారంభం కావడంతో పది రోజుల నుంచి బోరుబావులు ఆగుతూ పోస్తున్నాయి. 2 గంటల్లో ఎకరం తడిసే పొలం మడి, ఇప్పుడు సాయంత్రం వరకు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దాదాపు నెల రోజుల్లో పంట చేతికొచ్చే దశలో సాగునీరందక పొలాలు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పంటలు కాపాడుకోవాడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇతర రైతులను నీళ్లకోసం బతిమిలాడటం, బావుల్లో పూడిక తీయించడం, ఎదుటి రైతులను బతిమిలాడటం లాంటి మార్గాలను అవలంభిస్తున్నారు. మార్చి మొదటివారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఇంకా ముస్ముందు తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు జోరుగా చర్చించుకుంటున్నారు. ఎలాగైనా వారి పంటలు పండించుకోవడానికి ఉదయం, రాత్రులు పంట పొలాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మండలంలో వెంకట్రావుపేట, మన్నెగూడెం, గోవిందారం క్లస్టర్ పరిధిలో దాదాపు 10 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుతానికి అక్కడక్కడ పంటలకు నీళ్లందక ఎండిపోతున్న, పరిస్థితి ఇలాగే మరో 15 రోజులు ఉంటే చాలా పంట పొలాలు ఎండిపోయే ఆస్కారం ఉందంటున్నారు రైతులు. ప్రస్తుతం భీమారం, కమ్మరిపేట, ఒడ్యాడ్, రాగోజీపేట, గోవిందారం, లింగంపేట గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులతో రైతులు నూతన బోరు బావులు తవ్విస్తున్నారు. 400 ఫీట్లు బోరు వేయించిన నీళ్లు రావడంలేదంటున్నారు రైతులు. అక్కడక్కడ కొద్దిపాటి నీళ్లు వచ్చినా.. మధ్యలోనే మోటార్లు ఎత్తివేస్తున్నాయి. ఇంకో 15 రోజులు రైతులకు గడ్డు కాలంగా మారింది ప్రస్తుత పరిస్థితి.

బీజేపీ గెలుపుపై దుబాయిలో సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న ఎన్‌ఆర్‌ఐ నాయకులు

మల్లాపూర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం స్ఫూర్తిదాయకమని బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు అన్నారు. ఆదివారం దుబాయిలోని సోనాపూర్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. నరేంద్రమోదీ నేతృత్వంలో భారతదేశాన్ని ప్రపంచం శక్తివంతమైన దేశంగా నిర్మించడంతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. ఎమ్మెల్సీల గెలుపులో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్ కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు నవనీత్ గాజా, ఆరే శరత్‌గౌడ్, ఆపర్ణ, విష్ణు కుంబాల, అశోక్ పెనుకుల, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ నిర్మాణానికి విరాళం

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో పల్లగుట్టపై నిర్మిస్తున్న అయ్యప్ప గుడి ధ్వజస్తంభ నిర్మాణానికి కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన నిమిషకవి నవీన్ రూ.1,82,000 రూపాయలు విరాళం అందజేశారు. విరాళం అందించిన నవీన్‌కు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, తేలు నరేశ్, కిషన్‌గౌడ్, రమేశ్, సతీశ్ పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో అటవీశాఖకు చెందిన భూమిని చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కథలాపూర్ సెక్షన్ అధికారి ఎం.డీ ముస్తాక్ ఆలీ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి అక్రమంగా మూడు ట్రాక్టర్లతో అటవీభూములను చదును చేయగా, మూడు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తనిఖీల్లో బీట్ ఆఫీసర్లు సాయిరాం, శివరాజ్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై కేసు

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పిప్పెర రాజేశ్‌ను చంపుతానని బెదిరించిన బీజేపీ నాయకుడు తోట ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రాజేశ్ పలు పార్టీల నాయకులతో ఉన్న ఫొటోలను ప్రసాద్ కొన్ని రోజులుగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీనిపై రాజేశ్‌ప్రసాద్‌ను ప్రశ్నించగా, అతడు దుర్భాషలాడి చంపుతానని బెదిరించాడు. రాజేశ్ ఫిర్యాదు మేరకు ఎస్సై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



మల్యాల: మండలంలోని బల్వంతాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2006-2007లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, ఆనాటి రోజులు స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు కంప్యూటర్ విరాళంగా అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన జెడ్పీ హైస్కూల్‌లో 2007-08 సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. ఆట పాటలతో సందడి చేసి, సామూహికంగా భోజనాలు చేశారు.





34 ఏళ్లకు ఒక్కచోట కలిశారు..

గొల్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1990-91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని, తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెగడపల్లి: దేశ వ్యాప్తంగా ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నెల 10 నుంచి 12 వరకు సిరిసిల్ల వేములవాడలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి ప్రచార పోస్టర్లను ఆదివారం పెగడపల్లిలో ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి కోసం జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశానికి దళితులు భారీగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, ప్రకాశ్, అంజయ్య, రాజేశం, భాస్కర్, హనుమంత్, రవి, భూమయ్య, రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల పరిధిలో రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రాజెక్టు కుడికాలువలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం అడ్డుగా ఉండటంతో చివరి ఆయకట్టుకు నీళ్లు రావడం లేదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించి సాగునీందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ప్రశాంత్, నీటిపారుదల శాఖ డీఈ వేములవాడ సెల్ నం: 8074092371

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా భక్త మార్కండేయ జాతర ఉత్సవాలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లిలో శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో ఆదివారం ఐదో వార్షికోత్సవ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో హోమం, శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఎలాల జలపతిరెడ్డి, నల్ల రాజన్న, ఇతర నాయకులు జాతర ఉత్సవాలలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మైదాసు శ్రీనివాస్, మామిడాల గంగాధర్, ప్యాక్స్ డైరెక్టర్లు కొత్తూరి నారాయణరెడ్డి, సుతారి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



మడేలేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠించే విగ్రహాలను ప్రత్యేకంగా ఊరేగించి కొత్తగా నిర్మించిన ఆలయానికి తీసుకువచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, రాజేందర్, గంగాధర్, మధు, హరీశ్, అక్షయ్, అరవింద్, అజయ్ పాల్గొన్నారు.

పసుపు రైతుల గోస కేంద్రానికి పట్టదా..?



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్: పసుపు రైతుల గోస కేంద్ర ప్రభుత్వానికి పట్టడం లేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో ఆదివారం కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. పసుపు రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు. పసుపు బోర్డు ప్రకటించకపోతే బీజేపీకి ఓట్లు వేయరని ఎన్నికల్లో ప్రధాని మోదీతో హామీ ఇప్పించి అర్వింద్ ఎంపీగా గెలుపొందాడన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను దగా చేస్తూ నామమాత్రపు పసుపు బోర్డును ఏర్పాటు చేసిందని దుయ్యబట్టారు. ఈ సీజన్‌లో పసుపు రైతులు నష్టపోకుండా పసుపుబోర్డుకు వెంటనే రూ.5వేల కోట్లు కేటాయించి పసుపు పంటకు రూ.15వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న పసుపు రైతులు చేపట్టనున్న మహాధర్నాకు రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, నాయకులు సిరిపురం రవీందర్, గాజుల రాజరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్, రొండ్ల రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అహంకారుల వల్లే అంబేడ్కర్‌కు అవమానం



అంబేడ్కర్‌కు పూలమాల వేస్తున్న నాయకులు

సారంగాపూర్: కుల అహంకారుల వల్లే అంబేడ్కర్‌కు అవమానం జరిగిందని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన నాగునూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై కఠినమైన శిక్షలు అమలు చేస్తే ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కావన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండలశాఖ అధ్యక్షుడు పూడూరి శోభన్, ఎవుసం గంగాధర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మల్లారెడ్డి, గజ్జెలరాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం

రాయికల్: మండలంలోని భూపతిపూర్, మూటపల్లి, రాయికల్‌లో ఆదివారం దళిత సంఘ నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెలిమెల మల్లేశం, రాజేశ్, రత్నాకర్, ఇంతియాజ్, సంజీవ్, లక్ష్మణ్, బెక్కం తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.